# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పంచాయితీలు స్వయం సాధికారత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పని కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**
3. **రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**
4. **గ్రామాల్లో రక్షిత తాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**
5. **వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

==========================

పంచాయితీలు స్వయం సాధికారత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. బీహార్‌లోని మధుబనిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పర్యటించి.. అక్కడ నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 13,480 కోట్ల రూపాయలతో చేపట్టిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించి, శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. గ్రామాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తున్నామని తెలిపారు. 2 లక్షలకు పైగా గ్రామాల్లో ఇంటర్ నెట్ సదుపాయాన్ని కల్పించామని ప్రధానమంత్రి తెలియజేశారు.

--------------------------

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పని కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఈరోజు పాల్గొని.. పురస్కారాలను ప్రదానం చేశారు. పంచాయతీలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 39 సెకన్లు....

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వైయస్సార్ కడప జిల్లా పర్యటనలో భాగంగా కొప్పర్తి పారిశ్రామిక వాడను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొప్పర్తి పారిశ్రామిక వాడలో మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న టెక్నాలజీ కేంద్రాన్ని 20 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..35 సెకన్లు

---------------------------

గ్రామాల్లో రక్షిత తాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో పైలట్ మంచి నీటి పథకాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా స్థానిక తాగునీటి సమస్యలు పరిష్కారమవడంతో పాటు శుద్ధమైన తాగునీరు ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. పైలట్ స్కీమ్ ఇతర ప్రాంతాల్లో విస్తరిస్తామని వెల్లడించారు.రక్షిత నీటి పథకం వినియోగంలోకి తెచ్చేందుకు జలజీవన్‌మిషన్ కింద ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేయడంలో అధికారులు కీలక భూమిక పోషించాలని అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి హరీష్ మాధుర్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలుతున్న కేంద్ర సంక్షేమ పథకాలపై ఆయన నిన్న అమలాపురంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా హరీష్ మాధుర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జలజీవన్ మిషన్ వంటి పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సామాన్యుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా పథకాల అమలుపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులో జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల సమన్వయంతో సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. భూమి కేటాయింపులలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రణాళిక బద్ధమైన ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పి-4 కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించడం, మరొకరిని వ్యాపారవేత్తగా రూపొందించడానికి అనువైన పరిస్థితులు కల్పించాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో 2029 చివరి నాటికి అర్హులకు శాశ్వత గృ హాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. విజయవాడలోని గృహనిర్మాణసంస్థ

కార్యాలయంలో నిన్న ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఇళ్లపై సౌర్య ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తామని, బీసీలు, ఇతర వర్గాలకు ప్రభుత్వం అందించే రాయితీతో పాటు అవసరమైన మిగతా మొత్తాన్ని రుణం అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు.

---------------------------

మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అనంతపురం జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఓబులు తెలిపారు. అనంతపురంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా చేయవచ్చని చెప్పారు. మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రతి శుక్రవారం ఫ్రై డే, డ్రై డే కార్యక్రమంను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇళ్లలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న గ్రామంలో జాన్ 1 తేదీ నుండి పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలియజేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం ఇసుక దిబ్బల వద్ద ఈ నెల 27 వ తేదీ నుంచి ఇసుక సరఫరా చేయాలని సూచించారు. ఇసుకను తరలించేందుకు వీలుగా నిల్వ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని, ఇందుకు స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. అలాగే ఇసుక అక్రమంగా తరలించకుండా ఉండేందుకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని తెలిపారు.

---------------------------

విశాఖపట్నం జిల్లా సింహాచల క్షేత్రంలో ఈనెల 30వ తేదీన శ్రీ వరాహ నరసింహ స్వామి వారి నిజరూప దర్శనం, చందనోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు వెల్లడించారు. ఇందులో భాగంగా ఈరోజు నుంచి టికెట్లు విక్రయాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు దేవస్థానం నిర్దేశించిన ప్రాంతాలతో పాటు ఆన్‌లైన్ లో కూడా ఈనెల 29వ తేదీ వరకు 3 వందలు , వెయ్యి రూపాయలు చొప్పున టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు ఉచిత క్యూలైన్ దర్శనాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

=====================